కేసీఆర్‌తో అలంకానిపేట బీఆర్‌ఎస్ నాయకులు

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన నాయకులు

నెక్కొండ, జూన్ 18: తెలంగాణ తొలి సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో అలంకానిపేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం కలిశారు. మాజీ సర్పంచ్ మాదాసు రవి, వైస్ ఎంపీపీ కర్పూరపు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు చీకటి శ్రీనివాస్, నాయకులు వడ్డెపల్లి స్వామి, గుంటుక సహదేవ్ ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. పంటల సాగు తీరును తెలుసుకున్నారు. నాయకులను కేసీఆర్ ఆప్యాయంగా పలకరించి వారితో ముచ్చటించారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నట్లు తెలిపారు. ఇటీవల నెక్కొండ వైస్ ఎంపీపీగా ఎంపికైన కర్పూరపు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులను ఈ సందర్భంగా కేసీఆర్ అభినందించారు.

విత్తన దుకాణాలను తనిఖీలు చేస్తున్న కలెక్టర్

నగరంలో కలెక్టర్ విస్తృత పర్యటన

కాశీబుగ్గ, జూన్ 18: ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి మంగళవారం వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా విత్తన షాపులు, ఆగ్రో సెంటర్లను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాలు, యూరియా స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట తహసీల్దార్ ఇక్బాల్ ఉన్నారు. అలాగే, ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని గోదాంల్లో భద్రపరిచిన ఈవీఎం స్ట్రాంగ్ రూంలను సందర్శించారు. లాగ్‌బుక్, సీసీ కెమెరాల పర్యవేక్షణ, వాచ్‌రూంలను తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రసాద్‌రావు పాల్గొన్నారు. అనంతరం మార్కెట్‌లోని పత్తియార్డును పరిశీలించారు. పత్తి క్రయవిక్రయాలు, లావాదేవీలను ప్రత్యేకంగా తెలుసుకున్నారు. అలాగే, మార్కెట్‌లోని రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట సెక్రటరీ గుగులోత్ రెడ్డినాయక్, రైతులు ఉన్నారు.

శిక్షణ శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

కాశీబుగ్గ, జూన్ 18: తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, నటరాజ కళాకృష్ణ నృత్య జ్యోతి అకాడమీ సంయుక్తంగా నిర్వహించనున్న పేరిణి నృత్య శిక్షణ శిబిరం-2024 పోస్టర్‌ను సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతి పైడి జయరాజ్ ఆడిటోరియంలో ఎన్నారై సుభాష్, సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, ఒగ్గు కళాకారుడు రవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ కాకతీయులు అందించిన గొప్ప వరం పేరిణి నాట్యం అన్నారు. పేరిణి నాట్యంతో సైనికుల్లో ప్రేరణ కలిగించి, ఉత్తేజ పరిచి, యుద్ధానికి సంసిద్ధం చేసి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ధైర్యాన్ని నింపిన గొప్ప కళగా అభివర్ణించారు. జాతీయ యువ పురస్కార గ్రహీత దస్తాద్ బిస్మిల్లాఖాన్, విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల అధ్యాపకుడు చాతరాజు నవ్యజ, పేరిణి రుద్రశ్రీ గజ్జెల రంజిత్‌కుమార్, మెట్కురి చంద్రకళ, బండారి వైష్ణవి, తౌడసం గురుదేవ్, సంతోష్, బండారి తేజస్విని పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో టీచర్ల కొరత

- జిల్లాలో 724 ప్రభుత్వ పాఠశాలలు
- మంజూరైన ఉపాధ్యాయ పోస్టులు 3,255
- ప్రస్తుతం ఉన్న టీచర్ల సంఖ్య 2,681
- 574 పోస్టులు ఖాళీ
- కుంటుపడుతున్న విద్యాబోధన
- పలు పాఠశాలల్లో కొరవడిన తాగునీరు, పరిశుభ్రత

వరంగల్ ఎల్బీనగర్‌లో అద్దె భవనంలో ఇరుకైన గదుల్లో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలలు

వరంగల్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దుతామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో మాత్రం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నది. కొన్ని మౌలిక వసతులు కల్పించినా సర్కారు బడులను పలు సమస్యలు వెంటాడుతున్నాయి. వివిధ పథకాల ద్వారా పలు స్కూళ్లలో ప్రభుత్వం మరుగుదొడ్లు, విద్యుదీకరణ, విద్యార్థులు, సిబ్బంది కోసం ఫర్నిచర్, స్కూళ్లకు పెయింటింగ్, మరమ్మతులు, గ్రీన్ చాక్‌బోర్డులు, ప్రహరీలు, కిచెన్ షెడ్లతోపాటు ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ విద్య వంటి వసతులను కల్పించింది. అయితే, తాగునీటి వసతి ఏర్పాటు చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికితోడు ప్రతి స్కూల్‌లో పరిశుభ్రత కొరవడింది. టాయిలెట్స్‌ను శుభ్రపరిచే వ్యవస్థ లేదు. స్వీపర్, ఇతర సిబ్బంది లేకపోవడంతో ఆయా పాఠశాలల గదుల్లో దుమ్ము, ధూళి, ఆవరణల్లో చెత్తాచెదారం పేరుకుపోతుంది. వీటిని పక్కనపెడితే ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలను టీచర్ల కొరత వెంటాడుతోంది. ఇప్పటికీ పలు ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు లేవు. దీంతో సొంత భవనాలు లేని స్కూళ్లు అద్దె భవనాల్లో అరకొర వసతులతో కొనసాగుతున్నాయి.

సొంత భవనాలు లేని 26 స్కూళ్లు

వరంగల్ జిల్లాకేంద్రంలోని వరంగల్, ఖిలావరంగల్ మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలను పరిశీలిస్తే.. ఇక్కడ 26 సర్కారు స్కూళ్లకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాల్లో పనిచేస్తున్న ఈ పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వ ఆదరణ కరువైంది. ఈ స్కూళ్లు పనిచేస్తున్న అద్దె భవనాల యజమానులకు నెలనెలా రెంటు అందడం లేదు. వరంగల్, ఖిలావరంగల్ మండలాల్లో అద్దె భవనాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలకు ప్రస్తుతం సుమారు రూ.20లక్షలు అద్దె రూపంలో ప్రైవేటు భవనాల యజమానులకు సర్కారు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి అద్దె రాకపోవడంతో కొందరు యజమానులు ప్రభుత్వ పాఠశాలలకు ఖాళీ చేయిస్తున్నారు. వరంగల్ ఎల్బీనగర్‌లో ఎంజే రోడ్డు స్కూల్‌ను యజమాని ఇటీవల ఖాళీ చేయించాడు. దీంతో ఉపాధ్యాయులు ఇరుకైన రెండు గదులను అద్దెకు తీసుకుని ఎంజేరోడ్డు ప్రాథమిక పాఠశాలను షిఫ్ట్ చేయడం ద్వారా ఈ విద్యా సంవత్సరం తరగతులను పునఃప్రారంభించారు. విచిత్రమేమిటంటే ఈ ప్రైవేటు భవనం యజమానికి తమ జేబులో నుంచి అద్దె చెల్లించేలా టీచర్లు ఒప్పందం చేసుకున్నారు. మరికొన్ని ప్రభుత్వ పాఠశాలలదీ ఇదే పరిస్థితి.

ఉపాధ్యాయులు లేని పాఠశాలలు

ఉపాధ్యాయుల కొరత కారణంగా సర్కారు బడుల్లో విద్యార్థులకు బోధన సరిగా అందడం లేదు. అనేక స్కూళ్లలో కొన్ని సబ్జెక్టులను బోధించే టీచర్లు లేరు. ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక వరంగల్ జిల్లాలోనే 20 శాతం ఖాళీలు ఉన్నాయి. మొత్తం 724 సర్కారు బడుల్లో.. 478 ప్రాథమిక, 86 ప్రాథమికోన్నత, 160 ఉన్నత పాఠశాలలు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ 724 స్కూళ్లలో 77 రాష్ట్ర ప్రభుత్వ, 568 లోకల్ బాడీ, 61 ఎయిడెడ్, 10 కేజీబీవీ, 6 మోడల్, ఒక టీఎస్‌ఆర్‌ఈఐఎస్, ఒక యూఆర్‌ఎస్ ఉన్నట్లు చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కోసం సర్కారు మొత్తం 3,255 ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేసింది. ప్రస్తుతం 2,681 మంది టీచర్లు మాత్రమే ఉన్నారు. వివిధ కేటగిరీల్లో 574 టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 37 గణితం, 6 ఫిజిక్స్, 41 బయాలజీ, 24 ఇంగ్లిష్, 69 సోషల్, 10 తెలుగు(ఎల్‌పీ), 12 హిందీ (ఎల్‌పీ), 66 ఎల్‌ఎఫ్‌ఎల్‌హెచ్‌ఎం, 191 ఎస్‌జీటీ, 4 పీజీహెచ్‌ఎం గ్రేడ్-2, 21 తెలుగు (ఎస్‌ఏ), 16 హిందీ(ఎస్‌ఏ), 4 ఉర్దూ, 6 పీడీ, 6 పీఈటీ, 8 సీఐ, 5 డీఎం, 3 వీవోసీ, 29 ఆఫీస్ సబార్డినేట్, 16 నైట్ వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు జిల్లా నుంచి విద్యాశాఖ అధికారులు కొద్దిరోజుల క్రితం ప్రభుత్వానికి నివేదిక పంపారు. కొరత ఎక్కువగా ఉన్న పాఠశాలలకు ఇతర స్కూళ్ల నుంచి కొందరు టీచర్లను డిప్యూటేషన్‌పై నియమించింది. ఉపాధ్యాయుల కొరత వల్ల బోధన కుంటుపడుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థికి సన్మానం

అబ్దుల్ రఖిబ్

నర్సంపేటరూరల్, జూన్ 18: చదువులో ప్రతిభ కనబర్చి ఉద్యోగం సాధించిన విద్యార్థినిని పలువురు అధ్యాపకులు అభినందించారు. లక్నేపల్లిలోని బిట్స్‌లో బీటెక్ సీఎస్‌ఈ (ఏఐ అండ్ ఎంఎల్) నాలుగో సంవత్సరం చదువుతున్న షేక్ అబ్దుల్ రఖిబ్ షాక్ట్ సెట్ సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఏడాదికి రూ. 10 లక్షల వేతనంతో ఎంపికైనట్లు చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. దీంతో అతడిని మంగళవారం సన్మానించారు.

విద్యుదాఘాతంతో మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

గీసుగొండ, జూన్ 18: విద్యుదాఘాతంతో మతిస్థిమితం లేని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ జాన్‌పాక శివారులోని కావ్య పాలిమర్స్ పైపుల గోదాం వద్దకు మంగళవారం మతిస్థిమితం లేని గుర్తుతెలియని వ్యక్తి (35 నుంచి 40 ఏళ్ల వయస్సు) వచ్చాడు. అతడు పిచ్చిగా ప్రవరిస్తూ గోదాం ప్రహరీ ఎక్కాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు చేతులు తగలడంతో షాక్‌కు గురై కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. పైపుల గోదాం యాజమాని గవాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై తెలిపారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి

కరీమాబాద్, జూన్ 18: ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లతో ధరణి దరఖాస్తుల పరిష్కారాల పురోగతిపై సమీక్షించారు. ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ధరణి పెండింగ్ దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అలాగే, కలెక్టర్ ప్రైవేట్ దవాఖానల రిజిస్ట్రేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ కోసం ప్రతిపాదనలు రాగా, అందులో నాలుగింటికి ఆమోదం తెలిపి ఒకటి తిరస్కరించారు. నిబంధనల మేరకు మళ్లీ ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సమీక్షలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. పలు శాఖల అధికారులు, యూనియన్ నాయకులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలల టెండర్ల కేటాయింపు

కలెక్టరేట్‌లో డ్రా పద్ధతిలో 2024-25 విద్యా సంవత్సరానికి మైనార్టీ పాఠశాలల్లో ఆహారం తదితరాలు సరఫరా చేసేందుకు అదనపు కలెక్టర్ సంధ్యారాణి అధ్యక్షతన టెండర్ల కేటాయింపు చేపట్టారు. నర్సంపేట, వరంగల్, వర్ధన్నపేటలోని మైనార్టీ పాఠశాలలకు టెండర్లు నిర్వహించగా, 41 మంది పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ నేతలు

కరీమాబాద్, జూన్ 18: ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సత్య శారదాదేవిని మంగళవారం టీఎన్జీవోస్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

నెక్కొండ, జూన్ 18: మండలకేంద్రంలో బొడ్రాయిని పునఃప్రతిష్ఠించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. గ్రామ దేవతలకు విశేష పూజలు అందించి పంచామృతాలతో అభిషేకం చేశారు. భువనేశ్వరి, భూలక్ష్మి, నాభిశిల బొడ్రాయిని నూతన వస్త్రాలతో అలంకరించారు. గుమ్మడికాయలు, నిమ్మకాయలతో దిష్టితీసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

బాబు(ఫైల్)

వర్ధన్నపేట, జూన్ 18: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. మృతుడి భార్య, పోలీసుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట పట్టణానికి చెందిన కొండేటి బాబు(49) ఈనెల 16న రాత్రి 8.30 గంటల సమయంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ కార్యాలయం వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న తన ఇంటి వద్ద వేచి ఉన్నాడు. ఈ క్రమంలో వర్ధన్నపేట నుంచి రాయపర్తి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో బాబు తలకు బలమైన గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే 108లో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బయోఫ్లాక్ పద్ధతి లాభదాయకం

ప్రారంభిస్తున్న డాక్టర్ మహేందర్

కరీమాబాద్, జూన్ 18: బయోఫ్లాక్ పద్ధతిలో చేపల పెంపకం చేపడితే మత్స్యకారులకు ఖర్చు తగ్గి లాభాలు వస్తాయని పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకుడు డాక్టర్ మహేందర్ అన్నారు. మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో బయోఫ్లాక్ పద్ధతిలో ఏర్పాటు చేసిన చేపల పెంపకం యూనిట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం షెడ్యూల్డ్ కులాల వారికి వ్యవసాయ రంగంలో వినియోగించే కిట్లు అందజేశారు. కేవీకే సమన్వయకర్త, అధిపతి డాక్టర్ రాజన్న, శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, డాక్టర్ రాజు, డాక్టర్ శశాంక్, డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ గణేశ్, రైతులు పాల్గొన్నారు.

వలస కార్మికుడి మృతి

గిర్మాజీపేట, జూన్ 18: బస్టాండ్ ఆవరణలో ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు ఓగి(47) మృతి చెందాడని ఇంతెజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ తెలిపారు. ఎల్బీనగర్‌లో ఒక బిల్డింగ్ వద్ద ఓగి కూలీగా పని చేస్తున్నాడు. వచ్చిన డబ్బులతో రోజూ మద్యం తాగి పనికి సరిగా వెళ్లకపోవడంతో యజమాని పని మానేయమని సూచించాడు. ఈ క్రమంలో అతడు మద్యం తాగి బస్టాండ్ ఆవరణలో విగతజీవిగా పడి ఉన్నాడని సీఐ తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే 8712685118 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

మిగిలిన సీట్ల కోసం దరఖాస్తులు

సంగెం, జూన్ 18: గవిచర్ల మోడల్‌స్కూల్‌లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ముజుబుర్ రహమాన్ తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీలు ఉన్న సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బీపీసీ, సీఈసీ, ఎంఈసీలో ఉన్న ఖాళీలను కూడా భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 22లోగా మోడల్ స్కూల్‌లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. వివరాలకు 9553975496, 8978697147 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నిత్యావసర సరుకులు అందజేత

రాయపర్తి, జూన్ 18: జింకురాంతండాకు చెందిన లకావత్ గోజీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మైలారం గ్రామానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త, ఎస్‌ఆర్‌ఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబానికి మంగళవారం తన ప్రతినిధులతో నిత్యావసర సరుకులు పంపించారు. కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు రాథోడ్ సురేందర్‌నాయక్, గబ్బెట బాబు, మొలుగూరి పున్నమయ్య, ధూమ్‌సింగ్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన సబ్ రిజిస్ట్రార్

కరీమాబాద్, జూన్ 18: కొన్ని రోజులుగా సెలవులో ఉన్న ఖిలావరంగల్ మండల సబ్ రిజిస్ట్రార్ కార్తీక్ మంగళవారం ఉర్సు బైపాస్ రోడ్డులోని కార్యాలయంలో విధుల్లో చేరారు. ఆయన సెలవుల్లో వెళ్లిన నాటి నుంచి ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. దీంతో కొంత క్రయవిక్రదారులు ఇబ్బంది పడ్డారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★ Urgent Requirement for Corporate DSA Office Fresher & Exp. Female Tele-Callers, Quali: 12th & Best Talking Skills. Vacancies-30, Sal+Incentives etc., Job Location: HNK. Cont: 9032744373.
NTW-7701

CHANGE OF NAME
★ I, NIMMANI SANTHOSH (New name), H.No. 19-10-207, Shambunipet, Rangashaipet, Warangal dist.-506002, T.S., NIMMANI SANTOSH (Old Name), hence forth be charged as NIMMANI SANTHOSH for all purpose.
NTW-00

EDUCATION
★ రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727

లీజు / కిరాయి
★ HNK, అదాలత నుండి K.L.N. రోడ్‌కు వెళ్ళే మెయిన్ రోడ్, (S.V.కాలనీ) రోడ్ నెం.5, 1st, 2nd, 3rd అంతస్థుల భవనం 1650Sft కిరాయికి/ లీజు ఇవ్వబడును. (న్యూ బిల్డింగ్) సంప్ర ॥ 9502879612.
KMM_11687

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

నర్సంపేట రూరల్, జూన్ 18: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని మాదన్నపేట హైస్కూల్ హెచ్‌ఎం ఎ.రామచంద్రు అన్నారు. మంగళవారం గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అర్చన, సుధావాణి, అశోక్, వెంకన్న, లీలా, విశాల, సంతోష్, పీఎస్ హెచ్‌ఎం అంజన్‌కుమార్, యాదగిరి, భిక్షం, రమేశ్, అనూష, శోభ, రజిత పాల్గొన్నారు.

మాదన్నపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

యథావిధిగా పన్నుల సేకరణ

- జూలై 1 నుంచి మీ సేవ కేంద్రాల్లో చెల్లింపులు
- కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- తెల్లవారు జామున పారిశుద్ధ్య హాజరు పాయింట్ల తనిఖీ

కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, జూన్ 18: కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మీ సేవ కేంద్రాల్లో జూలై 1 నుంచి ఆస్తి పన్నులు చెల్లింపులు చేయవచ్చని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. మంగళవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో రెవెన్యూ విభాగం అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. తెల్లవారుజామున 5గంటలకు అశోకా, అమృత థియేటర్ పాయింట్ల వద్ద పారిశుద్ధ్య కార్మికుల హాజరును తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా గ్రేటర్ పరిధిలోని 12 మీ సేవ కేంద్రాలు, వార్డు కార్యాలయాల్లో పన్నుల చెల్లింపులు నిలిచిపోయాయన్నారు. వాటిని పునరుద్ధరించే ప్రక్రియ జరుగుతున్నదని, జూలై 1 నుంచి యథావిధిగా పన్నుల సేకరణ జరుగుతుందన్నారు. నీటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. పారిశుధ్య కార్మికులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. గైర్హాజరుకు కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా విధులకు హాజరుకాకపోతే జీతంలో కోత విధించాలని, ఔట్ సోర్సింగ్ కార్మికులు సుదీర్ఘకాలంగా విధులకు గైర్హాజరైతే ఉద్యోగం నుంచి తొలగించాలని ఆదేశించారు. డ్రైనేజీలు, కుమార్‌పల్లిలో పర్యటించిన కమిషనర్ రెండు వైపులా డ్రైనేజీలు ఉండగా ఒక వైపు చెత్త తొలగించక పోవడంపై జవాన్‌ను మందలించారు. మచిలీబజార్ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య పని తీరుపై కమిషనర్ స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, ఆర్వోలు సుదర్శన్, శ్రీనివాస్, యూసుఫొద్దీన్, షహజాదీ బేగం, ఐటీ మేనేజర్ రమేశ్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, ఇన్‌స్పెక్టర్ అనిల్, జవాన్లు పాల్గొన్నారు.

ముందుకు సాగని పనులు

ఉర్సు చెరువు కట్ట సుందరీకరణకు మోక్షమేది?

సలాకులతో ఉన్న ఉర్సు చెరువు కట్ట

కరీమాబాద్, జూన్ 18: ఉర్సు చెరువు కట్టపై చేపట్టిన అభివృద్ధి పనులు కొంత కాలంగా ముందుకు సాగడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. దీంతో ప్రజలు, వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుకట్టను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు చొరవ చూపి పనులు వేగంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

రాయపర్తి, జూన్ 18: మండల కేంద్రం శివారులో మంగళవారం రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. మండలకేంద్రంలోని మసీదులో ఇమామ్‌గా విధులు నిర్వర్తిస్తున్న మహ్మద్ అమీర్ హుస్సేన్ తన సమీప బంధువైన సర్ఫరాజ్‌తో కలిసి బైక్‌పై వర్ధన్నపేట మండలం ల్యాబర్తికి వెళ్తున్నాడు. కొత్త రాయపర్తి శివారులోకి రాగానే మహబూబ్‌నగర్ రోడ్డు మలువు వద్ద బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న కందకంలో పడిపోయింది. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, వారిని 108 వాహనంలో ఎంజీఎం దవాఖానకు తరలించారు.

మొండ్రాయిలో కురుస్తున్న వర్షం

గవిచర్లలో రోడ్డుపై పడిన భారీ వృక్షం

చిగురించిన ఆశలు

సంగెం, జూన్ 18: మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన వానతో రైతుల్లో ఆశలు చిగురించాయి. తొలకరి కోసం ఎదురు చూసిన అన్నదాతలకు కాస్త ఉపశమనం కలిగింది. వేల రూపాయలతో విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు ముందస్తుగా నాటారు. వానలు పడకపోవడంతో గింజలు ఎండిపోయాయి. ఈ క్రమంలో కురిసిన వాన కొంత ఊరటనిచ్చింది. గవిచర్ల మోడల్ స్కూల్ సమీపంలోని వరంగల్-నెక్కొండ ప్రధాన రహదారిపై గాలివానకు చెట్లు కూలడంతో కొంతసేపు రాకపోకలు స్తంభించాయి.

ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగాలి

మేయర్ గుండు సుధారాణి

పారిశుధ్య పనుల పురోగతిపై సమీక్షిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్,జూన్ 18 : గ్రేటర్ వరంగల్ పరిధిలో ప్రతి ఇంటి చెత్త సేకరణ సక్రమంగా జరగాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఆమె పారిశుధ్య పని తీరుపై సమీక్ష నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తేనే పారిశుధ్య వ్యవస్థ ఆశాజనకంగా సాగుతుందని అన్నారు. డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదని అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. శానిటరి ఇన్‌స్పెక్టర్లు తమ డివిజన్ల పరిధిలో డ్రైనేజీ క్లీనింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి నిషేధిత ప్లాస్టిక్‌ను అరికట్టాలన్నారు. ఓపెన్ ప్లాట్లలో చెత్త, మురుగునీరు నిల్వ ఉంటే జరిమానాలు విధించాలని ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ శానిటరి ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని డివిజన్లపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. కార్మికుల హాజరు సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో తీసుకోవాలని సూచించారు. డంపర్‌బిన్‌ల నుంచి కాంపాక్టర్లు చెత్తను తొలగించే క్రమంలో జియో ట్యాగ్‌తో కూడిన ఫొటోలను పంపించాలని ఆదేశించారు. సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, ఎలక్ట్రికల్ ఈఈ సంజయ్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు సాంబయ్య, భాస్కర్, నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బడి మొదలైనా.. పూర్తికాని పనులు

కరీమాబాద్, జూన్ 17: వేసవి సెలవులు ముగిసి ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభమైనా పలు స్కూళ్లలో పనులు పూర్తికాకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. వేసవి సెలవుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి, మరమ్మతు పనులు ఆలస్యం కావడంతో ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. బీరన్నకుంటలోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్టేజీ మరమ్మతులు, మూత్రశాలలు, గదుల నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతునే ఉన్నాయి. దీంతో పనుల కోసం తీసుకొచ్చిన సామగ్రిని తరగతి గదులు, పాఠశాలల మైదానంలో వేశారు. దీంతో ప్రార్థనా సమయం, ఆటల సమయాల్లో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

పిల్లర్ దశలోనే ఉన్న నిర్మాణం

స్టేజీకి మరమ్మతులు చేస్తున్న కూలీలు